



## పోలీసు నిఘాలో గ్రూప్-1 పరీక్షలు

నగరంలో రెండు రోజులుగా టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు పోలీసుల బందోబస్తు మధ్య కొనసాగుతున్నాయి. పరీక్షలకు ఆయా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం మహిళా అభ్యర్థులను తనిఖీ చేస్తున్న మహిళా పోలీసులు

# ఎట్టకేలకు అందుబాటులోకి ఓటీఎస్..!!

- జీవో జారీయైన 17 రోజుల తర్వాత అమల్లోకి..
- అసలు మొత్తం చెల్లిస్తే ఆలస్య రుసుం, వడ్డీపై రాయితీ
- సులువుగా బిల్లు చెల్లించేందుకు జల మండలి ఏర్పాట్లు
- బిల్లు చెల్లింపునకు ఈ నెల 31 ఆఖరి తేదీ
- ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి: జలమండలి ఎండీ





సిటీబ్యూరో, అక్టోబరు 22(నమస్తే తెలంగాణ): వన్ టైం సెటిల్‌మెంట్ పథకం (ఓటీఎస్) ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం జీవో ఇచ్చిన 17 రోజుల తర్వాత మంగళవారం నుంచి వినియోగదారుల ఫోన్ నంబర్లకు ఎస్ఎంఎస్‌లను చేర్చారు. పెండింగ్ బిల్లులను చెల్లించి ఆలస్య రుసుముతో పాటు వడ్డీపై రాయితీ పొందాలని జల మండలి ఎండీ అశోక్ రెడ్డి ఈ సందర్భంగా బకాయిదారులకు విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలికంగా బిల్లులు చెల్లించని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకం ఈ నెల 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లుల్ని చెల్లించి, నగర ప్రజలకు తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ సేవలందిస్తున్న జల మండలికి సహకరించాలని కోరారు.

### సందేహాలుంటే 155313 కి కాల్ చేయొచ్చు.

జల మండలి పరిధిలో 13.50 లక్షల నల్లా కనెక్షన్లు ఉండగా.., ఈ వన్‌టైం సెటిల్‌మెంట్ పథకంతో 7 లక్షలకు పైగా వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది. వీరి వద్ద నుంచి అసలు మొత్తం దాదాపు రూ.1706 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. కాగా, రూ.1189 కోట్ల బకాయిలు మాఫీ అవుతాయి. జల మండలి వినియోగదారుల క్యాన్ నంబర్‌కు అనుసంధానమై ఉన్న మొబైల్ నంబర్‌కు బకాయి మొత్తం, ఎంత చెల్లించాలి? ఎంత మాఫీ అవుతుంది? తదితర వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతోంది. సామాజిక మాధ్యమాలైన ట్విట్టర్, ఫేస్‌బుక్, ఎలక్ట్రానిక్ మీడియా, ఎఫ్ఎం రేడియో, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ఓటీఎస్ -2024 పథకంపై అవగాహన కల్పిస్తోంది. ఓటీఎస్ పథకంపై ఏవైనా సందేహాలుంటే జల మండలి కస్టమర్ కేర్ నం. 155313కు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చు.

### చెల్లింపు విధానం..

- జల మండలి కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్ల వద్దకు నేరుగా వెళ్లి బిల్లు చెల్లించవచ్చు.
- ఆన్‌లైన్ విధానంలో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్స్ ద్వారా చెల్లించవచ్చు
- ఎన్ఈఎఫ్‌టీ, ఆర్టీజీఎస్, బీపీపీఎస్ ద్వారా చెల్లించే అవకాశం కూడా ఉంది.
- జల మండలి అధికారిక వెబ్‌సైట్‌కు www.hyderbadwater.gov.in లాగిన్ అయి చెల్లింపులు చేయొచ్చు.
- లైన్‌మెన్లు మీ గృహాల్ని సందర్శించినప్పుడు వారి దగ్గర ఉండే ఈపీఓఎస్ యంత్రం ద్వారాను బిల్లు చెల్లించవచ్చు
- మీ సేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా సైతం బిల్లు చెల్లించే అవకాశాన్ని కల్పించారు.
- https://erp.hyderabadwater.gov.in/HmwssbOnlineNew/#/HmwssbOTSDetails ఇక్కడ పేర్కొన్న లింకును క్లిక్ చేయడం ద్వారా నేరుగా బిల్లు చెల్లించవచ్చు.
- జల మండలి అందించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సులభంగా బకాయి మొత్తం చెల్లించవచ్చు.

### జర్నలిజంలో ఛత్రపతికి ఓయూ డాక్టరేట్



సిటీబ్యూరో, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం నుంచి గోదావరిఖనికి చెందిన రేసు ఛత్రపతి యాదవ్ మంగళవారం డాక్టరేట్‌ను పొందారు. 'అభివృద్ధి స్థాన భ్రంశం, ప్రసార మాధ్యమాలు, విధాన రూప కల్పన, పౌర సమాజం, నిర్వాసితుల మధ్య భావ వ్యక్తీకరణ-రాజకీయాలు' అనే అంశంపై డాక్టర్ సతీశ్ కుమార్ తల్లాడి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తండ్రి వెంకటయ్య సింగరేణి విశ్రాంత ఉద్యోగి. ఈ డాక్టరేట్ పట్టాను మరణించిన తన తల్లి సుశీలకు అంకితం చేస్తున్నట్లు ఛత్రపతి తెలిపాడు. 52 ఏండ్ల వయస్సులో డాక్టరేట్ సాధించడం ఆనందంగా ఉందన్నారు.



మెహిదీపట్నంలో ర్యాలీని నిర్వహిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ తదితరులు

## మూసీ సుందరీకరణకు రూ.లక్ష 50 వేల కోట్లా?

**విద్యార్థుల ఫీజు బకాయి చెల్లించడానికి మాత్రం నిధులు లేవు**
**బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్,కృష్ణయ్య**

మెహిదీపట్నం, అక్టోబర్ 22: విద్యార్థులకు ఫీజు బకాయిలు నాలుగు వేల కోట్లు చెల్లించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కిటకిటలాడుతుందని, మూసీ సుందరీకరణకు లక్షా 50 వేల కోట్లను కేటాయించడానికి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని మాజీ ఎంపీ, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్,కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థులతో ఫీజు బకాయిలు చెల్లించాలంటూ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ నేతృత్వంలో మెహిదీపట్నంలో మంగళవారం పెద్ద ఎత్తున నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకోవడం సమంజసం కాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ మాట్లాడుతూ ఫీజు బకాయిలు చెల్లించకుంటే రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తామని తీవ్రంగా హెచ్చరించారు.



జూబ్లీహిల్స్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రాంగణంలో మాస్కులతో మౌన దీక్ష చేస్తున్న జేఏసీ సభ్యులు ఉద్యోగులు

## కొనసాగుతున్న అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన

**మౌన దీక్షకు దిగిన ఉద్యోగుల జేఏసీ**

బంజారాహిల్స్, అక్టోబర్ 22: జూబ్లీహిల్స్ రోడ్ నం.46లోని డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఎఫ్ఏయూకు కేటాయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూఅంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. యూనివర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బంది, ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నోటికి మాస్కులు, నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం మౌనదీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్ పర్సన్ ప్రొ. పల్లవి కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జి.మహేశ్వర్ గౌడ్, అధ్యాపకేతర ఉద్యోగుల సంఘం నేతలు హబీబుద్దీన్, షబ్బీర్, డా. యాకేష్, కిషోర్ కుమార్, డా. అవినాష్, డా. రాఘవేందర్ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ, క్రిమీ లేయర్లను అమలు చేయొద్దు

**ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ కృష్ణ స్వరూప్**





సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ స్వరూప్

హిమాయత్‌నగర్, అక్టోబర్ 22: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ, క్రిమీ లేయర్‌ను అమలు చేయొద్దని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని డీబీపీ కేంద్ర కార్యాలయంలో సమితి ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ, క్రిమీ లేయర్‌ను అమలు చేయడం వల్ల దళితులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా, ఉద్యోగ అవకాశాలను ఎస్సీ, ఎస్టీలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కుట్ర పూరితంగానే దళితులను విడగొట్టి అణిచివేయాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎస్సీ వర్గీకరణ అమలు చేయొద్దని లేఖ రాసినట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ నేతలు డాక్టర్ వీఎల్ రాజు, జేఎన్ రావు, పబ్బతి శ్రీకృష్ణ, రోజా లీలా, అశోక్, రాజలింగం, శ్రీకాంత్, సుచంద్ర, రవీంద్ర, సుబ్బారావు, ప్రవీణ్ కుమార్, సునీల్ పాల్గొన్నారు.

## మాలల ఓట్ల కోసం నాటకాలాడుతున్న రేవంత్

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ**



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన పబ్బతి శ్రీకృష్ణ

ఎర్రగడ్డ, అక్టోబర్ 22: ప్రజా సంక్షేమ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో మాలలు తగిన విధంగా బుద్ధి చెబుతారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. బోరబండలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాలల ఓట్ల కోసం రేవంత్ నాటకాలాడుతున్నడని విమర్శించారు. తెలంగాణలో జి.వివేక్, కె.నాగరాజులను ముందు పెట్టి మాలల ఆత్మీయ సమ్మేళనాలంటూ మభ్యపెడుతున్నారని, అవి కేవలం కాంగ్రెస్ సమ్మేళనాలని అందరికీ తెలుసునని పేర్కొన్నారు. ఒక కులం వారు ఏ పార్టీలో ఉన్నా అందర్నీ ఆహ్వానించి నిర్ణయాలు తీసుకోవాలి తప్ప, కేవలం కాంగ్రెస్‌లో ఉంటున్న తనకు అనుకూలురైన వాళ్లను పిలిపించుకుని రేవంత్ తెలివిగా నాటకాలాడుతున్నారని ఘాటుగా విమర్శించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన మాల నాయకులను రాజకీయంగా అణగదొక్కటమే ధ్యేయంగా వ్యవహరిస్తున్న పార్టీలకు గుణపాఠం నేర్పాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. అనంతరం తోటి నాయకులతో కలిసి పబ్బతి శ్రీకృష్ణ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

# ముత్యాలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు షురూ..



కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



ముత్యాలమ్మ ఆలయం వద్దం స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 22: కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయం పునరుద్ధరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 14వ తేదీన దుండగుడు అమ్మవారి ఆలయంపై దాడి చేసి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఆ మరుసటి రోజు నుంచి అమ్మవారి శుద్ధీకరణ, కలశ స్థాపన అనంతరం స్థానికుల ఆధ్వర్యంలో నిత్యపూజలు జరుగుతున్నాయి. దేవాలయ పునర్ నిర్మాణంపై పలువురు దాతలు, రాజకీయ నాయకులు ముందుకు వచ్చారు. అయితే, ప్రభుత్వం ఎట్టకేలకు దేవాలయ పునరుద్ధరణ పనులు దేవాదాయ శాఖ ద్వారా చేయించాలని నిర్ణయించారు. దీంతో మంగళవారం దేవాదాయ అదనపు శాఖ అదనపు కమిషనర్ జ్యోతి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితుల మధ్యన భూమి పూజను నిర్వహించి పనులను ప్రారంభించారు.

### అన్ని విధాలా చేయూతనిస్తా..: మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ముత్యాలమ్మ ఆలయ పునరుద్ధరణ పనుల కోసం తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వేద పండితులతో కలిసి ఆయన అమ్మవారి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆయన మాట్లాడి దేవాలయ పున:ప్రతిష్ట కార్యక్రమానికి ముందుంటానని తెలిపారు. అవసరం అయితే హోమాలు, విగ్రహా ప్రతిష్ట, కుంభాభిషేకం నిర్వహిస్తానని వెల్లడించారు. ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించాలని అన్నారు .ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. తన చిన్న నాటి నుంచి సికింద్రాబాద్ లో ఇలాంటి పరిస్థితులను చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులకు ముగింపు పలికి ప్రశాంత వాతవారణంలో ప్రజలు జీవించాలని ఆయన కోరుకున్నారు . అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన నిందితుడికి కఠిన శిక్షలు పడాలని, ఇది అత్యంత దురదృష్టకరమైన ఘటన అని అభివర్ణించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరి కృష్ణ, స్కైలాబ్, నాగులు, రాములు, మహేష్ యాదవ్, సత్యనారాయణ, జయరాజ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

### ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం పూర్తి సహకారం: ఎమ్మెల్యే శ్రీ గణేష్

ముత్యాలమ్మ ఆలయం పునరుద్ధరణ కోసం ప్రభుత్వం దేవాదాయ శాఖ ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు. ఆయన దేవాదాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఫౌండర్ ఫ్యామిలీ, బస్తీ వాసుల కోరిక మేరకు అమ్మవారి విగ్రహన్ని పంచలోహాలతో తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. కానీ, కొంత మంది అమ్మవారి ఆలయం వద్ద రాజకీయాలు చేస్తూ, ఫ్యామిలీ సభ్యులు, బస్తీ వాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని, అలాంటి వారిని అమ్మవారే చూసుకుంటుందని తెలిపారు. బస్తీ వాసులు ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బద్రినాథ్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, బల్వంతరెడ్డి, సంకి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులపై దాడి ఘటనలో పలువురి అరెస్ట్



బేగంపేట్, అక్టోబర్ 22: సంచలనం సృష్టించిన ముత్యాలమ్మ దేవాలయ విధ్వంస ఘటనకు నిరసనగా పలు సంస్థలు ఈ నెల 19న చేపట్టిన ప్రదర్శనల్లో పోలీసులపై దాడులకు పాల్పడ్డ ఐదుగురు వ్యక్తులను మార్కెట్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో చోటు చేసుకున్న విధ్వంసానికి నిరసనగా ఈ నెల 19న వివిధ హిందూ సంస్థలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌ను పురస్కరించుకుని బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులపై ఆందోళనకారులు వాటర్ బాటిళ్లు, రాళ్లు, చెప్పులు విసిరారు. ఈ ఘటనకు సంబంధించి మార్కెట్ ఎస్ఐ మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ అల్లర్లకు సంబంధించి ఆయా పరిసరాల్లో సీసీ ఫుటేజీలు, వీడియో రికార్డింగుల ఆధారంగా మార్కెట్ పోలీసులు బీజేపీ, బజరంగ్ దళ్, వీహెచ్‌పీకి చెందిన నాయకుల ప్రమేయాన్ని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఇందులో బీజేపీకి చెందిన కొంతం నరేష్, సహా వివిధ సంస్థలకు చెందిన ప్రశాంత్, కిరణ్, వంశ తిలక్, శరత్ ఠాకూర్, రాంరెడ్డి, కిషన్, శివరామ్, సాయి ప్రకాశ్, సంతోశ్, రాజేశ్, శ్రీనివాస్, శరత్, సుభాశ్, అంజి, ప్రవీణ్ తదితరులపై కేసులు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా మోహన్, రాజేశ్, ఎల్లేశ్, ఆయుశ్ రాజ్, చింతకాయల శివాజీ, జ్ఞాన సుందర్‌లను రిమాండ్‌కు తరలించారు. కాగా, ఘటనకు బాధ్యులైన మరి కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## సమాజాన్ని మేల్కొల్పిన నాటక రంగం

**కేఎల్ శత జయంతి ముగింపు సభల్లో వక్తలు**

హైదరాబాద్, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ): సమాజంలో విలువల నిర్మాణం సాహిత్య సాంస్కృతిక కళా రంగాల ద్వారానే నిర్మితమవుతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. గురజాడ కన్యాశుల్కం నాటకం దగ్గర నుంచి కేఎల్ నరసింహారావు విప్లవ శంఖం నాటిక వరకు సమాజంలోని దురాగతాల్ని వెలికితీస్తూ అద్భుతమైన నాటకాలు వచ్చాయని చెప్పారు. తెలుగు యూనివర్సిటీలో మంగళవారం సాయంత్రం కోదాటి లక్ష్మీ నరసింహారావు కేఎల్ జయంతి ఉత్సవాలు ముగింపు సభలు జరిగాయి. సభకు అధ్యక్షత వహించిన జూలూరు మాట్లాడుతూ, తెలంగాణ మాండలిక తొలి నాటక రచయితగా కేఎల్ చరిత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మునగాల పరగణ రేపాల గ్రామంలో గ్రామ వెలుగు నాట్య కళా మండలి ద్వారా కేఎల్ సంవత్సరాల తరబడి నాటక ప్రదర్శనలు కొనసాగించి తెలుగు నాటక రంగానికి ఊపిరి పోసారని ఆయన సేవల్ని కొనియాడారు. కేఎల్ లాంటి మహనీయుల శతజయంతి సభ జరుపుకోవడం సమాజం తనను తాను సత్కరించుకున్నట్లే అవుతుందని తెలిపారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ, సమాజంలో అన్యాయాలను నాటకాల ద్వారా చూపెట్టారని అలనాటి నాటకాలను విశ్లేషించారు. గత కాలాన్ని విలువలతో నడిపించిన చరిత్ర నాటక రంగానికి ఉందన్నారు. నాటకం విస్తృత రూపమే నేటి సినిమా రంగమని తెలిపారు. ఈ సభలో అంతర్జాతీయ నటులు దర్శకులు గుమ్మడి గోపాలకృష్ణ, సీనియర్ నటులు దర్శకులు బాసాని మర్రెడ్డి, సంగీత నాటక అకాడమీ పూర్వ చైర్మన్ శివ కుమార్, చిలువేరు రఘురాం, తడకమళ్ళ రామచంద్రరావు, కేఎల్ కుమారుడు కోదాటి వెంకటరమణ, కోదాటి అరుణ, సోమ అంజిరెడ్డి పాల్గొన్నారు.




## వర్షం.. ట్రాఫిక్ జామ్

నగరంలో మంగళవారం పలుచోట్ల వర్షం కుండపోతగా పడింది. గచ్చిబౌలి, శేరి లింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ, చిక్కడపల్లి, ముషీరాబాద్, ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్ర వేళల్లో విడతల వారీగా కురిసింది. ఈ నేపథ్యంలో కార్యాలయాలకు వెళ్లే వారు, సాయంత్ర వేళల్లో ఇండ్లకు వెళ్లే వారు ఆయా రహదారులపై ప్రవహిస్తున్న వరద తాకిడికి ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం రోడ్ల మీదకు వచ్చిన వారు సైతం వాన తాకిడి, ట్రాఫిక్ స్తంభనలతో ఇబ్బందులకు గురయ్యారు.



చిక్కడపల్లిలో..

